పతివ్రతలా
కనిపించిన
ఆ ఇల్లాలి
అసలు రూపం!

# నియోగం

చంద్రం
కథ

ఆరోజు పోస్టులో ఓ కవరొచ్చింది నాకు.

కవరుమీది రాత పరిచితమైంది కాదు. రెండు పక్కలా తిప్పి చూశాను. ఫ్రమ్ అడ్రస్ లేదు. వెంటనే చించి, మడిచివున్న అరఠావు కాగితాన్ని బయటకు తీశాను.

'మూర్తికి' అంటూ పొడిగా ప్రారంభమైందా ఉత్తరం.

★ ★ ★

సరిగ్గా పాతికేళ్ల క్రితం-

టెలిఫోన్ డిపార్ట్‌మెంట్‌లో ఆపరేటర్ ఉద్యోగం వచ్చింది నాకు.

అప్పుడునా వయస్సు ఇరవై సంవత్సరాలు. డిగ్రీ ఫైనలియర్ చదువుతున్నాను. చదివేదే ఉద్యోగం కోసం కనుక, డిగ్రీ తర్వాత పూర్తిచేసుకోవచ్చులెమ్మని మరో ఆలోచన చెయ్యకుండా ఉద్యోగంలో చేరిపోయాను.

సికింద్రాబాద్‌లో రెండు నెలల ట్రెయినింగ్ పూర్తిచేసి, పోస్టింగ్ ఆర్డర్ చేత పుచ్చుకుని సామర్లకోట వెళ్లాను.

అక్కడి ఆఫీసు చిన్నది. ఉద్యోగుల సంఖ్య తక్కువ. తాత్కాలికంగా ఓ లాడ్జిలో దిగాను నేను. వెంటనే వసతి వెతుక్కోవాలి. ఊరు కొత్త గనుక పాతవారి సహాయం కోరడం అనివార్యమైంది.

నా అభ్యర్థన ఆలకించి కొందరు అలాగే అన్నారు. మరికొందరు చూద్దాం అన్నారు.

జగన్నాథరావుగారు మాత్రం ఓసారి మా ఇంటికి రండి అని వెంటబెట్టుకు వెళ్లారు.

జగన్నాథరావుగారి వయస్సు సుమారు ముప్పై ఐదు సంవత్సరాలుంటుంది. ఆపరేటరుగా పద్నాలుగేళ్ల సర్వీసుంది. మనిషి శాంత స్వభావుడు. ప్రథమ దర్శనంలోనే గౌరవభావం కలిగింది నాకు.



జగన్నాథరావుగారుంటున్నది ఓ పాత పెంకుటిల్లు. ప్రహరీ వుంది. మరొకరితో సంబంధం లేదు. ఆ ఇల్లు జగన్నాథరావుగారి స్వంతం కాదు. యజమాని మరో ఊళ్లో వుంటాడు. వీళ్లుంటుండగా ఓ గదీ, వంటగదీ వున్న వాటా మిగిలి వుంది. అవసరమైన సౌకర్యాలన్నీ వున్నాయి. వంటగది అవసరం నాకు లేదు. అయినా అద్దె అనుకూలంగా వుండడంవల్ల ఆరోజే గృహప్రవేశం

చేసేశాను.

జగన్నాథరావుగారి భార్య వర్ధనమ్మ.

తెల్లగా బొద్దుగా తగువుమాత్రం ఎత్తులో వుంటుంది వర్ధనమ్మ. కట్టు, బొట్టు, నడక, మాటతీరు... అన్నింటా సంస్కారం ఫుట్టిపడుతూ వుంటుంది. విచిత్రం ఏమిటంటే భార్యాభర్తలిద్దరూ మితభాషులే. తగిన జోడీ అనిపించింది నాకు.

వయసులో భర్తకన్నా నాలుగైదేళ్లు చిన్న వుంటుంది వర్ధనమ్మ. దురదృష్టం ఏమిటంటే వాళ్లకి సంతానం లేదు. పెద్దవాళ్లుకూడా ఎవ్వరూ వెంట లేరు. కేవలం వాళ్లిద్దరే ఆ ఇంటిలో వుండేది.

ఓ నెల గడిచింది. ఉద్యోగరీత్యా ఆఫీసులో కలిసిమెలిసి వుండడంవల్ల జగన్నాథరావుగారితో నాకొంచెం చనువేర్పడింది.

ఇంటివద్ద నుయ్యి, స్నానాలగది, మరుగుదొడ్డి ఉమ్మడి వ్యవహారమే. అయినా వర్ధనమ్మతో మాట్లాడే అవకాశం నాకు రాలేదు. అవసరమూ కలగలేదు. గడిచిన నెలరోజుల్లోనూ మా ఇద్దరి మధ్య ఒక్కసారికూడా సంభాషణ జరుగలేదంటే అతిశయోక్తిగా అనిపించవచ్చుగాని అది యదార్థం. నన్నుచూసి ఆమె తల వంచుకు పోయేది. ఆమెను చూసి నేను పక్కకు తప్పుకునేవాణ్ణి.

ఈ నెలరోజుల్లోనే ఏదో ఓ పండుగ వచ్చింది. ఆరోజు తమ ఇంటిలోనే భోజనం చెయ్యమన్నారు జగన్నాథరావుగారు. నేను మొహమాటపడి వద్దన్నా, వదలకుండా బలవంతంగా ఒప్పించారు.

విశేషం ఏమిటంటే వర్ధనమ్మే వడ్డించింది. ఆ సందర్భంలోకూడా మా మధ్య మాట కలవలేదు. ఫలానా పదార్థం మరికొంచెం వడ్డించమని భార్యతోనూ, వేయించుకోమని నాతోనూ చెప్తూ జగన్నాథరావుగారే సంధానకర్తగా వ్యవహరించారు.

టెలిఫోన్ ఎక్స్చేంజి ఇరవై నాలుగు గంటలూ పనిచేసే ఆఫీసుగనుక ఆపరేటర్లకు షిఫ్టు డ్యూటీలు తప్పనిసరి. పగలు ఎక్కువమంది వున్నా, చిన్న ఆఫీసు గనుక నైట్ డ్యూటీలో ఒకకరే వుంటారు. రాత్రి పదకొండు గంటలకు వెళ్లే ఇంక తెల్లవారిన తర్వాతే రావడం.

ట్రెయినింగ్‌నుంచి తిన్నగా వచ్చిన కొత్తవాణ్ణి నేను. తెలుసుకోవాల్సిన విషయాలు చాలా వుంటాయి. పగలైతే పక్కన ఎవరో ఒకరుంటారు. కనుక సందేహం వచ్చినా సమస్య వుండదు. అదే రాత్రైతే ఇబ్బంది అయిపోతుంది. అందుకనే పని నేర్చుకునేంతవరకు ఓ నెల్లాళ్లపాటు నైట్‌డ్యూటీనుంచి తప్పించారు నన్ను.

★ ★ ★

ఆరోజు నైట్ డ్యూటీ పడింది నాకు. పనంతా నేర్చుకున్నాను గనుక నైట్ డ్యూటీ చేయడానికెలాంటి జంకూ కలగలేదు. అయితే సాయంత్రంవేళ జగన్నాధరావుగారొచ్చి మరుసటిరోజు తనకు పని వుందని, నైట్ డ్యూటీ చేస్తానని అన్నారు. నైట్ డ్యూటీ చేస్తే మరుసటిరోజు పగలంతా ఖాళీయేగనుక సెలవు పెట్టకుండా పనిచేసుకోవచ్చు. అవసరం అయినప్పుడు ఆపరేటర్లు పరస్పరం డ్యూటీలు మార్చుకునే సౌకర్యం వుంది. నాకెటూ పనిలేదు కనుక నైట్ డ్యూటీ జగన్నాథరావుగారికిచ్చేశాను. /

ఆ సాయంత్రం పెందలాడే హోటల్లో భోజనం ముగించి గదికి వచ్చేశాను. కొంత చదివి వదిలిన బుచ్చిబాబు నవల 'చివరకు మిగిలేది' పట్టుకున్నాను. అది పూర్తయేసరికి దాదాపు పది గంటలైంది. తర్వాత నిద్రకుపక్రమించాను.

ఎంతసేపు నిద్రపోయానో తెలీదు. తలుపు చప్పుడు కావడంతో తుళ్లిపడి లేచి గడియ తీశాను.

బెడ్ బల్బు కాంతి మసగ్గా వుంది. అయినా

గుమ్మంలో నిలబడ్డ వ్యక్తిని స్పష్టంగా పోల్చుకోగలిగాను నేను.

నా ఆశ్చర్యానికి అవధులు లేకపోయినయ్.

అంత రాత్రివేళ నాతో ఏం పని వర్ధనమ్మకి? అన్న ప్రశ్నకి సమాధానం చెప్పుకోవడం కష్టం కాలేదు కాని, వర్ధనమ్మని ఆ స్థితిలో చూడడమే నమ్మశక్యం కాలేదు నాకు.

స్త్రీ సంబంధమైన ఆలోచనలు బుర్రని తొలిచేయడం, ఒంటిని వేడెక్కించడం ఎప్పుడో మొదలైనప్పటికీ, వర్ధనమ్మ విషయంలో నేనెప్పుడూ అలా ఊహించుకోలేదు. ఆవిణ్ణి ఉన్నతంగా పవిత్రంగా ఊహించుకోవడానికే అలవాటు పడ్డాను. చూపుల్లోనూ, ప్రవర్తనలోనూ కూడ ఆ భావాన్ని ప్రకటిస్తూ వుండేవాణ్ణి.

అంతా తలకిందులైపోయింది.

అంచనాలు అప్పుడప్పుడు తప్పిపోవడం సహజమే కాని, వర్ధనమ్మ విషయంలో అలా జరగడమే నన్ను ఆశ్చర్యచకితుణ్ణి చేసింది.

తప్పొప్పులు తెలిసికూడా కొన్ని సందర్భాల్లో తప్పువైపే మొగ్గు చూపడం జరుగుతుంటుంది. అవసరం, అవకాశం సానుకూలపడినప్పుడు తాత్కాలిక ప్రలోభానికి లోనుకావడం మానవనైజం.

కలలోనైనా అనుకోనిది వాస్తవం కాదేమోనని అనుమానించింది అక్షరాలా జరిగిపోయింది.


అనుభూతిని ఆశ్చర్యం మింగేసింది.

★ ★ ★

మరుసటిరోజు జగన్నాథరావుగారి ముఖం చూడలేకపోయాను. ఎదుటపడి మాట్లాడడానికి ముఖం చెల్లలేదు. సాధ్యమైనంతవరకు తప్పుకు తిరిగాను.

వర్ధనమ్మ ప్రవర్తనలో ఎలాంటి మార్పూ కన్పించలేదు. రాత్రి అసలేమీ జరగనట్టే ప్రవర్తించింది. నిండుకుండలాంటి మనిషి.

వారానికొకసారి డ్యూటీ ఛార్ట్ వేస్తారు. రిలీఫ్ రొటేషన్‌లో తప్ప సాధారణంగా వారం అంతా ఒకే డ్యూటీ పడుతుంది. ఆ వారం నాది నైట్ డ్యూటీ. ఒకరోజు ఆఫ్ పోను మిగతా ఆరు రోజులూ నైట్ డ్యూటీ చేయవలసి వుంది. కాని పగలు పని వుందని చెప్పి వారం మొత్తం తనే నైట్ డ్యూటీ చేశారు జగన్నాథరావుగారు.



రాత్రులు ఇంటివద్ద వర్ధనమ్మా - నేనూ! వారం మొత్తం ఒక్కలాగే గడిచింది.

జరుగుతున్నది తప్పనీ, తగని పనీ వివేకం హెచ్చరిస్తూనే వుంది. తొలిప్రయత్నం నాది కాదుగనుక నా తప్పేమీ లేదనుకోవడం ఆత్మవంచనే అవుతుందనీ తెలుసు. కథ అటునుంచే ప్రారంభమైనా, నా పాత్రలేకుండా ముగింపు ఎలా జరుగుతుంది! ప్రతిఘటించకపోవడంలోనే నా బలహీనత కనిపిస్తుంది. తప్పంతా వర్ధనమ్మ మీదకు నెట్టెయ్యడం అన్యాయం, దుస్సాహసం అవుతుంది.

వర్ధనమ్మ పగలూ రాత్రీ కూడా మితభాషే. తాను మాట్లాడలేదు. నన్ను మాట్లాడనివ్వలేదు. జరుగుతున్నదాన్ని మంచి చెడుల గురించి చర్చించే అవకాశమే లేకపోయింది. నా వరకు ఎంతో వితర్కించుకున్నాను. ఆత్మవిమర్శ చేసుకున్నాను. మానసికంగా కృంగిపోయాను. ఏ హోటల్లో టిఫిన్ చెయ్యాలో, ఏ హోటల్లో భోజనం చెయ్యాలో, ఏ సెలూన్‌లో క్రాఫ్ చేయించుకోవాలో, ఏ లాండ్రీలో బట్టలు వెయ్యాలో, ఆఫీసులో ఎలా మసలుకోవాలో... మొదలైన విషయాలన్నీ చెప్పడమేకాక దగ్గరుండి చూపించి, ఊరుకాని ఊరులో నా యోగక్షేమాలగురించి ఓ పెద్దన్నలా బాధ్యత వహించిన సహృదయుడు జగన్నాథరావుగారు. ఆయనకు నేను చేసిన అన్యాయం క్షమార్హం కాదనిపించింది. నావంటి కృతఘ్నుడికి తగిన శిక్ష లేదనిపించింది.

జగన్నాథరావుగారిని చూడాలన్నా, ఎదుట పడాలన్నా, మాట్లాడాలన్నా ధైర్యం చాలని పరిస్థితి వచ్చేసింది.

ఒకే ఇంటిలో వుంటూ, ఒకే ఆఫీసులో పనిచేస్తున్నవాళ్లం. ఎంతకాలమని తప్పించుకు తిర్గగలను?

ఈ సమస్యకు పరిష్కారమేమిటా? అని బుర్ర బద్దలు కొట్టుకుంటున్న సమయంలో ఉద్యోగపరంగా ఓ చక్కని అవకాశం వచ్చింది నాకు. పక్క ఊళ్లో ఉన్న ఆఫీసులో స్టాఫ్ తక్కువైన కారణంగా ఇక్కడనుంచి ఓ ఆపరేటర్ని డిప్యుటేషన్‌మీద అక్కడకు పంపమన్ని ఆర్డరొచ్చింది. వాలంటరీగా వెళ్లేవారు లేనప్పుడు ఉన్నవాళ్లలో జూనియర్ని పంపడం రివాజు. అదృష్టవశాత్తు ఎవ్వరూ వెళ్లడానికి సుముఖంగా లేకపోవడంతో ఆ అవకాశం నాకే దక్కింది. కాగలకార్యం గంధర్వులే తీర్చారన్నట్టు నా చిక్కు సమస్యకు చక్కని పరిష్కారం దొరికింది.

మొదట డెప్యుటేషన్ నెలే అన్నారు. తర్వాత అది రెండు ఆ తర్వాత మూడు నెలలకు పొడిగించబడింది. అంతా మనమంచికే లెమ్మనుకున్నాను. ఆపైన అక్కడే పర్మినెంటుగా వుంచేస్తామన్నారు. నాకెలాంటి అభ్యంతరం లేకపోయింది. ఈ లోగా మరో డివిజన్ నుంచి ఇక్కడికి రావడానికి ఓ అభ్యర్థి దొరికాడు. వెంటనే మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్‌కి దరఖాస్తు పెట్టుకున్నాం. అవతలి వ్యక్తి గట్టి ప్రయత్నం చేశాడు. త్వరలోనే బదిలీ జరిగిపోయింది. ఇదంతా అవసరమై చేసింది కాదు. కేవలం జగన్నాథరావుగారికి సాధ్యమైనంత దూరంగా వెళ్లిపోవడానికి చేసిన ప్రయత్నం మాత్రమే.

జగన్నాథరావుగారు అప్పుడప్పుడు ఫోనులో మాట్లాడడానికి ప్రయత్నించారు. కాని వుండే, లేనని చెప్పించాను.

తర్వాత దృష్టి చదువుమీదకు మళ్లించి డిగ్రీ పూర్తిచేశాను. మరో డిపార్టుమెంటులో కాస్త మంచి ఉద్యోగం దొరకడంతో ఈ ఉద్యోగం వదిలేశాను. ట్రాన్స్‌ఫర్లమీద చాలా ప్రదేశాలు తిరిగాను. కొన్ని పైవాళ్లిచ్చినవి. కొన్ని నేను కావాలని పెట్టుకున్నవి.

వివాహం, పిల్లలు, సంసారబాధ్యతలు...

కాలగమనంలో ఎన్నో అనుభవాలు. పెరిగిన వయస్సుకు చిహ్నంగా నెరిసిన చెంపలు... అప్పుడే నలభై ఐదేళ్లు నిండినయ్ నాకు!

గడిచిన పాతికేళ్లలో ఎక్కడున్నా, ఏం చేస్తున్నా జగన్నాథరావు, వర్ధనమ్మ దంపతులను మాత్రం నేను మర్చిపోలేదు. తరచూ వాళ్ల జ్ఞాపకాలు స్మృతిపథంలో మెదులుతూనే వున్నాయి. జగన్నాథరావుగారు గుర్తొచ్చినప్పుడల్లా నా మనసు వికలమైపోయేది. ఆయనపట్ల నేను ప్రవర్తించిన తీరుకు నేనే అనేక విధాల నిందించుకునేవాణ్ణి. నా పాపానికి ప్రాయశ్చిత్తం లేదనుకుని విచారించేవాణ్ణి. ఆ దురదృష్టకర సంబంధాన్ని మర్చిపోవడానికి విఫలప్రయత్నాలు చేశాను. వ్యక్తిగా వాళ్లకి దూరమయ్యానేగాని, మానసికంగా వాళ్లకి సంబంధించిన ఆలోచనలకి దూరం కాలేకపోయాను.

ఇన్నాళ్లకి, ఇన్నేళ్లకి ఈ ఉత్తరం. అరఠావు కాగితానికి ఒకవైపున పట్టిపట్టి రాసిన అక్షరాలు. ఎక్కడ్నుంచో తెలుసుకోవాలన్న కుతూహలంతో ఉత్తరం చదవకుండానే ముందు అడుగున సంతకం చూశాను. వర్ధనమ్మ అన్న పేరు చూడగానే వళ్లు జలదరించింది నాకు. వర్ధనమ్మంటే జగన్నాథరావుగారి భార్యే. మరో వర్ధనమ్మెవరూ నాకు తెలీదు. ఆ పేరుగల మరో స్త్రీ ఎవ్వరూ ఇంతవరకు నాకు తారసపడలేదు.

పాతికేళ్ల తర్వాత వర్ధనమ్మనుంచి వచ్చిన ఉత్తరం. ఎవరినుంచైతే ఇంతకాలం నేను తప్పించుకు తిరుగుతున్నానో వారి దగ్గర్నుంచి వచ్చిన ఉత్తరం.

గబగబ చదివేశాను.

''.... నాలుగేళ్ల క్రితం వారు (జగన్నాథరావుగారు) కాలం చేశారు. సర్వీసులో వుండగానే చనిపోయారుకనుక ఆ డిపార్ట్‌మెంట్‌లోనే అబ్బాయికి ఉద్యోగం ఇచ్చారు. అన్నట్టు అబ్బాయి సంగతి నీకు తెలీదుకదూ! అబ్బాయి పుట్టిన తర్వాత ఆ శుభవార్త నీకు తెలియపర్చాలని ఎంతో కుతూహలపడ్డాం. నీ అడ్రస్‌కోసం మేం చెయ్యని ప్రయత్నం లేదు. అయినా ఫలితం లేకపోయింది. ఇప్పుడైనా ఆ వారపత్రికవారి పుణ్యమా అంటూ నీ ఫోటోతబాటు అడ్రస్‌కూడా వెయ్యబట్టి, అది నా కంట పడబట్టి నీ ఉనికి తెలిసిందిగాని, లేకపోతే ఈ ఉత్తరం రాసే అవకాశమే లేకపోను. చిత్రమేమిటంటే ఇంత దగ్గర్లో వుండికూడా

## అప్పు

''మా ఇంటికి రోజూ చాలామంది వస్తుంటారు!''
''అవునా? ఇంతకీ మీ నాన్నగారేం చేస్తారు?''
''అప్పులు!''
-పి.వి.మురళీకృష్ణ (హైద్రాబాద్)



ఒకరిగురించి ఒకరికి తెలీకపోవడం! అయిందేదో అయిపోయింది. ఇప్పటికైనా నీ గురించి తెలుసుకున్నందుకు సంతోషంగా వుంది. అంతకు మించి సంతృప్తిగా వుంది. నా అడ్రస్ ఇస్తున్నాను. ఒక్కసారి నువ్వు బయలుదేరి రా. నీకో ముఖ్య విషయం చెప్పాలి. నిజానికి ఎప్పుడో చెప్పాల్సిన విషయం అది. అప్పట్లో అవకాశం లేకపోయింది. తర్వాత నువ్వు దూరమైపోయావు. జీవితంలో ఆ అవకాశం వస్తుందోలేదో అని భయపడ్డాను. ఇప్పుడా భయం తీరిపోయింది. హృదయభారం కొంత తగ్గింది. నీతో చెప్పకుంటేగాని మనశ్శాంతి దొరకని విషయం మరి అది!''

చాలా కాలంగా అడపా దడపా నా కథలూ కవితలూ పత్రికలలో వస్తూనే వున్నాయి. ఇటీవల ఒక పత్రికవారు నిర్వహించిన పోటీలో నా కథకి బహుమతి రావడం, నా ఫోటోతో పాటు జీవిత విశేషాలూ, అడ్రసూ ప్రచురించడం జరిగింది. పత్రిక చదివే అలవాటు అంతగాలేని వర్ధనమ్మ దృష్టిలో అది పడడమే విశేషం.

పాపం జగన్నాథరావుగారు పోయారట!

వర్ధనమ్మ చెప్పాలనుకున్న అంత ముఖ్యమైన విషయం ఏమిటో?

మరుసటిరోజు ఆదివారం. ఆఫీసుకు సెలవేగనుక పొద్దున్నే టిఫిన్ చేసి బయలుదేరాను. విజయవాడలో నాన్‌స్టాప్ బస్ ఎక్కితే గంటా పది నిమిషాలలో గుడివాడలో దించేసింది.

గుడివాడ నాకు బాగా తెలిసిన ఊరే. పైగ ఆవర్ధనమ్మ వివరంగా అడ్రస్ రాసింది.

రిక్షాలో ఇంటిముందు దిగేసరికి ఓ పదేళ్లపిల్లాడు గుమ్మంలో కనిపించాడు.

''వర్ధనమ్మగారిల్లు ఇదేనా బాబూ?'' అనడిగాను.

''ఇదీ'' అని ఎడమపక్క పోర్షన్ చూపించి కుడిపక్క పోర్షన్‌లోకి వెళ్లిపోయాడా కుర్రాడు.

తలుపు తట్టాను.

ఓ స్త్రీ వెంటనే తలుపు తీసింది.

స్థూలకాయం, సగానికి పైగా నెరిసిన తల, వయోభారం - ఆమెలో వర్ధనమ్మ పోలికలెక్కడా కనిపించలేదు నాకు. కాని ఆమె వర్ధనమ్మే. ఆ సత్యం నమ్మడానికి నాక్కొంత సమయం పట్టింది. నన్ను వెంటనే పోల్చుకుంది వర్ధనమ్మ. చనువుగా లోపలకు ఆహ్వానించింది.

ఇంట్లో ఇంకెవ్వరగా వున్న సూచనలు కనిపించలేదు.

ఇద్దరం మధ్యగదిలో కూర్చున్నాం.

ఉదయం పది గంటల సమయం.

''ఇంట్లో ఎవ్వరూ లేనట్టున్నారు!''

''అబ్బాయి ఇంతకుముందే ఆఫీసుకెళ్లాడు

ఎదురుగా వున్న టేబుల్‌మీది ఫోటో ఫ్రేమ్‌మీద నా దృష్టి పడింది. నా చూపులోని కుతూహలం గమనించినట్టుంది వర్ధనమ్మ. లేచి ఫోటో తెచ్చి నా చేతిలో వుంచి ''అబ్బాయి ఫోటో'' అంది. నేను పరిశీలనగా చూస్తోంటే చిన్నగా నవ్వుతూ ''అచ్చుగుద్దినట్టొచ్చినయ్ నీ పోలికలు'' అంది. నేను గతుక్కుమన్నాను. నిజమే. ఆ వయసులో నేను దిగిన ఫోటోలా వంది. ఇంత స్పష్టంగా పోలికలు రావడం అరుదైన విషయం. కొద్ది క్షణాలు రెప్పవెయ్యకుండా ఫోటో చూస్తూ వుండిపోయాను.

తర్వాత నెమ్మదిగా అన్నాను. ''ఏదో ముఖ్యమైన విషయం చెప్పాలని వుత్తరంలో ...''

''అవును. అబ్బాయి గురించి చెప్పాలని''

''అబ్బాయి గురించా?''

'అవును. అబ్బాయి గురించే. మన అబ్బాయి గురించి. ముఖ్యంగా మీ అబ్బాయి గురించి. ఫోటో చూసింతర్వాత విషయం నీకర్థమయ్యే

వుంటుంది!''

అరటిపండు ఒలిచి అరచేతిలో పెట్టినంత స్పష్టంగా అర్థమైంది. కాని నా బుర్రను తొలిచేస్తున్న అనుమానం ఒకటుంది. ఈ విషయం జగన్నాథరావుగారికి తెలుసా? అని. అదే అడిగాను.

''తెలుసు'' నిబ్బరంగా అంది వర్ధనమ్మ.

''తెలుసా?'' ఆశ్చర్యంతో రెట్టించాను.

''ఆయనకి తెలీకపోవడమేం. మూలకర్త ఆయనేకదా!''

ఏమిటో నాకంతా గందరగోళంలా అనిపించింది. అయోమయంగా చూస్తోంటో అసలు కథ వివరించింది వర్ధనమ్మ.

''మాకు సంతానయోగం లేదని ఎప్పుడో తేలిపోయింది. వైద్య పరీక్షలో లోపం ఆయనలోనే వున్నట్టు నిర్ధారణ అయింది. అది ఆయనకి దుఃఖహేతువైంది. ఎవరినన్నా పెంచుకుందామన్నాన్నేను. అందుకాయన అంగీకరించలేదు. కాలం గడుస్తోంది. అప్పుడప్పుడు ఆయన తన లోపాన్ని గుర్తుచేసుకుని. కుమిలిపోయేవారు. తన కారణంగా నేను గొడ్రాలినయ్యానని బాధపడేవారు. పసిపిల్లవాడిలా వలవల ఏడ్చేవారు. ఆయన్ని సముదాయించడం కష్టమైపోయేది నాకు. కాలం గడుస్తోన్నకొద్దీ పరిస్థితులకు అలవాటు పడిపోసాగాం. ఈ లోగా నువ్వు రంగంలో ప్రవేశించావు. అలాంటి ఆలోచన ఆయనకెలా కలిగిందోగాని, అది విన్నప్పుడు నా తల తిరిగిపోయింది. ఆయనకు మతిపోలేదుకదా అనిపించింది. అది నావల్ల కాని పని అని నిర్మొహమాటంగ చెప్పేశాను. నచ్చచెప్పడానికి ప్రయత్నించారు. బతిమాలారు. అది ధర్మవిరుద్ధం కాదని వాదించారాయన. శాస్త్రం ఒప్పుకునేదే అని నొక్కిచెప్పారు. భారతంనుంచి ఉదాహరణలు చూపించారు. పాండురాజు అసమర్థుడైనప్పుడు కుంతి, మాద్రిలు ఈ మార్గాన్నే అవలంబించారన్నారు. ఆ మాటకొస్తే పాండురాజు, అతని అన్నగారైన ధృతరాష్ట్రుడూ కూడా తండ్రికి పుట్టిన బిడ్డలు కారన్నారు. ఈ పద్ధతిని 'నియోగం' అంటారనీ, ఇందుకు ఉదాహరణలు మన పురాణాల్లో వున్నాయని... ఇలాగే ఏవేవో చెప్పారు. ఎన్ని చెప్పినా ఆ పనికి నేనంగీకరించకపోవడంతో ఒట్టు పెట్టారు. ఆఖరి అస్త్రంగా చచ్చిపోతానని బెదిరించారు. ఇంక మార్గాంతరం లేక తలవంచక

## రోమియోలకు కళ్లెం?



అది కేరళలోని 'అలూవా' అనే పట్టణం! ఓరోజు ఓ అందమైన అమ్మాయి బస్టాండ్‌వద్ద సోయగాలుపోతూ నిలబడి వుంది. రోడ్డునపోయే ఓ రోమియోగారి కన్ను ఆ చిన్నారిమీద పడింది! అంతే... వెంటనే తన స్టయిల్‌లో ఆమెను ఆకట్టుకున్నాడు. క్షణాల్లో చెట్టాపట్టాలేసుకుంటూ విహరించసాగారు! అయితే ఆ రోమియోగారి సంతోషం ఎంతోసేపు నిలవలేదు. ఎందుకంటే అలా విహరిస్తూ.. తామిద్దరూ పోలీస్ స్టేషన్‌కు వెళ్లామని తెలిసేసరికి రోమియో కాళ్లు వణకసాగాయి! ఆ పట్టణంలో రోమియోల బెడద పెరగడంతో సర్కిల్ ఇన్స్‌పెక్టర్ తనవద్ద వున్న ఆడ కానిస్టేబుల్స్ చేత 'సోయగాలు' చిందించే డ్రెస్‌లు వేయించి రోడ్‌సైడ్ రోమియోల్ని పట్టుకోవడంలో విజయం సాధించగలిగారు! కంగ్రాట్స్ సార్!

- జూపిటర్

తప్పలేదు నాకు. అయిష్టంగానే ఆ పనికి సిద్ధపడ్డాను. కేవలం సంతానం కోరి నీ దగ్గరకు వచ్చానేకాని, మరో దృష్టి నాకు లేదు. వచ్చినందుకు ఫలం దక్కిందిగాని అసలు విషయం నీకు చెప్పుకునే అవకాశం ఆ కొద్దిరోజుల్లో లేకపోయింది. ఆ తర్వాత నువ్వు ఊరుమారిపోతావని తెలిసివుంటే ముందే నీకు అసలు సంగతి చెప్పి వుందును. నిజం తెలీని నువ్వు నా గురించి నీచంగా ఊహించే అవకాశం వుంది. అది సహజం కూడా. భర్తచాటున తప్పుచేసే స్త్రీపట్ల గౌరవభావం ఎలా వుంటుంది? సరే ఇప్పటికైనా జరిగింది చెప్పుకోగలిగాన్నేను. ఇంతకాలం ఓ నేరస్తురాలిలా కుంచించుకుపోయాను. ఇప్పుడు నా మనసెంతో తేలిగ్గా వుంది. ప్రాణానికి హాయిగా వుంది''

ఇంతా విన్న తర్వాత నాకో ధర్మసందేహం కలిగింది. ''ఒకవేళ నేనుకూడా జగన్నాథరావుగారిలా సంతాన సామర్థ్యం లేనివాణ్ణై వుంటే ఏమయ్యేది?''

తేలిగ్గా నవ్వేసింది వర్ధనమ్మ ''ఏమౌతుంది? విధం చెడ్డా ఫలం దక్కలేదన్న సామెత మరోసారి రుజువై వుండేది. అయితే అప్పుడు మేమున్న స్థితిలో అలాంటి ఆలోచన రాలేదు. వచ్చే అవకాశం కూడా లేదు''

నేను అపార్థం చేసుకుని వుంటానని ఇంతకాలం బాధపడింది వర్ధనమ్మ. విషయం విశదపరిచి, ఆ బాధనుండి విముక్తురాలైంది.

జరిగింది జగన్నాథరావుగారికి తెలీదనీ, నేనాయనకు నమ్మకద్రోహం చేశాననీ, చిరకాలంగా నేనూ బాధపడుతూ వచ్చాను. జరిగినదానికి మూలకర్త ఆయనే అని తెలిసిన తర్వాత నేనూ ఆ బాధనుంచి విముక్తి పొందినట్లైంది.

''అబ్బాయికి పెళ్లి నిశ్చయమైంది. వచ్చే నెలలోనే ముహూర్తం. శుభలేఖలు అచ్చుకాగానే పంపిస్తాను. మీ ఆవిణ్ణి తీసుకుని రా'' అంది వర్ధనమ్మ.

''అచ్చుగుద్దినట్టున్న అబ్బాయి పోలికలు చూస్తే మా ఆవిడకి అనుమానం వచ్చే ప్రమాదం వుంది. అందుకని ఆవిణ్ణి తీసుకురాను. నేనొక్కణ్ణే వస్తను''

''ముందు చూపెక్కువే. ఇంతకీ నీ వివరాలేం చెప్పావుకావు! ఎంతమంది సంతానం?''

''ముగ్గురు. ఇద్దరు మగ. ఒక ఆడ. ముగ్గురూ కాలేజీ చదువులకొచ్చారు. ఇంతకన్నా చెప్పుకోదగ్గ విశేషాలేమీ లేవు. వస్తా మరి'' అంటూ లేచాను.

''భోజనం చేసివెళ్దువుగాని. కూచో'' కంగారు పడింది వర్ధనమ్మ.

''భోజనం వేళకి వెళ్లిపోతాను. బస్సెక్కితే ఎంత? గంటన్నరలోపే!'' అంటూ బయటకు నడిచాను.

వీధిగేటువరకు వచ్చింది వర్ధనమ్మ. ★